క్లుప్తంగా

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : వీఆర్ఏలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, అర్హత ఉన్న వారికి వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేశు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట వీఆర్ఏలు నిర్వహించిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు నాగేంద్ర, వెంకట పతి, అశోక్, వెంకట రమణ, సీఐటీయూ నాయకులు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపులో భాగంగా గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, వీరనాల శివకుమార్, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సిద్ధిఖ్‌లు మాట్లాడుతూ ఇప్పటివరకు ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డీఎం ఓబులేశు, జేఏసీ నాయకులు నవీన్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ భారతదేశ చరిత్రలో ఒక ముఖ్యమైన రాజకీయ శక్తిగా నిలిచిందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందన్నారు.

– కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఉక్కాయపల్లెలో కేక్ కట్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి జకరయ్య, సత్తార్, మోపూరు వెంకట రమణారెడ్డి, బీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోపూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ దారిలో స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రానున్న రెండు, మూడు రోజులలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రిమ్స్ దారిలో ఆకతాయిలు అధికమవుతారని, మితిమీరిన వేగంతో వెళుతూ సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తారని, ఈ దారిలో స్పీడ్ గన్స్ ను బారిగేట్స్ ఏర్పాటు చేసి అతివేగాన్ని నియంత్రించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ కోరారు. గురువారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై అధిక శబ్దాలు చేస్తూ, స్టాండ్ ను రోడ్డుకు బలంగా నొక్కి పట్టి నిప్పు రవ్వలను రా చేసుకుంటూ మితిమీరిన వేగంతో ఆదారిపై వెళుతున్న ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తారని తెలిపారు.

నూతనంగా అన్నపూర్ణ మందిరం నిర్మాణం



భూమి పూజ అనంతరం మాట్లాడుతున్న డాక్టర్ రామ్ మనోహర్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం భాకరాపుపేట గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో నూతనంగా అన్నపూర్ణ మందిరం నిర్మాణంతోపాటు పాత ప్రార్ధనా మందిరాన్ని ఆధునీకరించనున్నట్లు వైద్యులు డాక్టర్ రామ్ మనోహర్ రెడ్డి దంపతులు తెలిపారు. గురువారం వారు అన్నపూర్ణ మందిరం నిర్మాణానికి సంబంధించి భూమి పూజ చేసి మాట్లాడారు. త్వరితగతిన ఈ నిర్మాణ పనులు పూర్తి చేసి గణపతి సచ్చిదానంద స్వామిని ఆహ్వానించి వారితో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలు సహకారాన్ని అందించాలన్నారు. మాతృమండలి ఉపాధ్యక్షులు ఎస్ విజయ కుమారి, ఎగ్జిక్యూటివ్ ట్రస్టు సభ్యులు నరసింహులు, శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు.

కోల్‌కతాకు కడప ఎన్జీఓ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కోల్‌కతా నగరంలో నిర్వహిస్తున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ సమావేశానికి ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా నుండి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపా ధ్యక్షులు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్, కోశాధికారి నిత్య పూజయ్య తదితరులు బయలుదేరి వెళ్లారు. ఈ సమావేశానికి మొత్తం 35 మంది ప్రతినిధులు తరలివెళ్లారు.

ఎన్నడూ లేనంతగా నగరంలో అభివృద్ధి

ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాష, మేయర్ సురేష్ బాబు అన్నారు. గురువారం 6వ డివిజన్ పరిధిలో కొండాయపల్లె విద్యుత్ నగర్‌లో కార్పొరేటర్ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మృత్యుంజయ కుంట శివాలయం అభివృద్ధికి రూ. 38.50లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లా తీవ్రంగా వెనుకబడి పోయిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ జిల్లా ఒకటుందని కూడా చంద్రబాబు గుర్తించలేదన్నారు. కడప నగరాభివృద్ధికి నయాపైసా నిధులు విడుదల చేయలే దని విమర్శించారు. ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి మరింతగా విస్తరించాలంటే మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు సానపురెడ్డి శివకోటిరెడ్డి, ఎం.రామలక్ష్మణ్‌రెడ్డి, మల్లికార్జున, షఫీ, నాయకులు బంగారు నాగయ్య యాదవ్, రామ్మోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, బుద్దాయపల్లె క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.



6వ డివిజన్‌లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు తదితరులు

మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యం

– ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

కడప కల్చరల్ : కడప నగరం మృత్యుంజయకుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష తెలిపారు. గురువారం మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను ఆయన మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డితో కలిసి పునఃనిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజద్‌బాష మాట్లాడుతూ 60 ఏళ్ల క్రితం డాక్టర్ వైఎస్సార్ తండ్రి వైఎస్ రాజారెడ్డి, స్థానిక ప్రముఖులు పార్వతమ్మ, చెన్నారెడ్డిలతో కలిసి ఈ స్థలాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా స్థానిక ప్రజలకు కానుకగా శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారన్నారు. పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 2017లో ఆలయాన్ని పునః నిర్మించేందుకు ప్రయత్నం చేశామని, కానీ నాటి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. ఈ విషయాన్ని తాము రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వచ్చి రూ. 38 లక్షల నిధులు మంజూరు చేయించి తిరిగి పనులను ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశామన్నారు.

– నగర మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ ఆలయం పనులు ఆగిపోయిన విషయం తెలుపగానే స్పందించి నిధులు మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దాతలు కూడా ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధిలో భాగం పంచుకోవాలని కోరారు. డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి మాట్లాడుతూ నగర అభివృద్ధిలో భాగంగా ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయనున్నామని, దాతలు సహకరించాలని కోరారు.

శాస్త్రోక్తంగా...

ఈ సందర్భంగా ఫిల్లర్ల స్థాయిలో ఆగిపోయిన ఆలయ నిర్మాణ పనులను అతిథులు ప్రారంభించారు. ఆలయ ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో అర్చకులు శశిధర్‌శర్మ, దక్షిణామూర్తి బృందం వేద పండితులతో కలిసి పునః నిర్మాణ పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మృత్యుంజయేశ్వరస్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్, కార్పొరేటర్లు లలిత, శివకోటిరెడ్డి, రామలక్ష్మణరెడ్డి, మల్లికార్జునతోపాటు స్థానిక ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరణలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, మేయర్ సురేష్‌బాబు తదితరులు



వందేమాతరం గేయానికి నృత్యం చేస్తున్న విద్యార్థులు



ప్రాజెక్టులను తిలకించేందుకు వస్తున్న విద్యార్థులు



కోలాటం చేస్తున్న విద్యార్థులు

సైన్స్‌ఫేర్ సందడి

కడప ఎడ్యుకేషన్: కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో జిల్లా సైన్సు అధికారి మహేశ్వరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 234 ప్రాజెక్టులు వచ్చాయి. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించేందుకు నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్యూ కట్టారు. దీంతోపాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోలాటం, వందేమాతరం, గానకచేరి తదితర కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి.

కడప బాలోత్సవం విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరం మరియాపురం సెయింట్ జోసెఫ్ స్కూల్లో జనవరి 5, 6వ తేదీలలో నిర్వహించనున్న కడప బాలోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక నగర కార్యదర్శి రాయల్‌కరీముల్లా కోరారు. ఇందుకు సంబంధించిన బాలోత్సవ సంబరాల పోస్టర్‌ను గురువారం డీఈఓ రాఘవరెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, ఎంఈఓ చిట్టిబాబు, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు సజ్జల వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్థవంతమైన చిత్రాలు గీయాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం లలితకళల విభాగాధిపతి డాక్టర్ కె. మృత్యుంజయరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జీవన సంప్రదాయాలు' మ్యూరల్ పెయింటింగ్‌పై ఐదురోజుల వర్క్‌షాప్‌ను వీసీ ఆచార్య చింతా సుధాకర్ సందర్శించారు. రెండోరోజు గురువారం ఆయన ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి విద్యార్థులు గీచిన చిత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్‌బ్లాక్ అంతర్గత గోడలపై గీస్తున్న చిత్రాలు అర్థవంతంగాను, ఆకర్షణీయంగాను, చూపరులను ఆలోచింపజేసేవిగా ఉండాలని సూచించారు. వర్క్‌షాప్ సంచాలకులు డా. కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ వర్క్‌షాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్‌లు పి. సంతోష్‌కుమార్, కె. రవి, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌ను పరిశీలిస్తున్న వీసీ, ప్రిన్సిపాల్ తదితరులు

వైవీయూ క్యాంటీన్ తనిఖీ

వైవీయూలోని క్యాంటీన్‌ను గురువారం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఇంజినీర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాలు చదవాలి

వైవీయూ : పుస్తకాలను ఇష్టంగా చదవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు మార్గం ఏర్పరచుకోవచ్చని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'జాతీ ఉర్దూ భాషా అభివృద్ధి మండలి' ఆధ్వర్యంలో గురువారం ఉర్దూ సంచార గ్రంథాలయం వైవీయూకు చేరుకుంది. ఈ సంచార గ్రంథాలయాన్ని వీసీ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి , ఉర్దూశాఖ విభాగాధిపతి డా. రియాజున్నీసా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఉర్దూ రచయితల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సత్తార్‌ఫైజి, ఉర్దూ అధ్యాపకులు డా. ఎస్. ఖాజాపీర్, సార్దర్ ఖాజామైనుద్దీన్, డా. నజీమున్నీసా, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బండ్లపల్లె ప్రతాప్ రెడ్డి, డీఈఓ, ఎమ్మెల్సీ

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్–257) 2024 సంవత్సరానికి సంబంధించిన డైరీ, క్యాలెండర్, జీవో సంపుటిని గురువారం కడప సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవ రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ రూపొందించిన డైరీ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాష, గురవయ్య, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు

కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పిరమలై కల్లర్ కులాన్ని ఏపీ రాష్ట్ర గెజిట్‌లో చేర్చి ఆయా కులస్తులకు కుల ధృవీకరణ పత్రాలు అందించాలని పిరమలై కల్లర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ తేవర్ కోరారు. గురువారం ఈ మేరకు ఆయన కడప నగర మేయర్ సురేష్‌బాబును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పిరమలై కల్లర్ కులస్తులు సుమారు 60 వేల మంది వరకు ఉన్నారన్నారు. ఈ విషయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి కుల ధృవీకరణ పత్రాలు ఇచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సౌందర్యరాజ్, అర్ధ సంచార విముక్తి జాతర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పసుపులేటి మనోజ్‌కుమార్, వైఎస్ఆర్‌సీపీ నేత బసవరాజు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో వివిధ సర్కిళ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా అంబేద్కర్ సర్కిల్ నుండి వై జంక్షన్ కూడలి పనులను, అన్నమయ్య జంక్షన్‌ను, మాసాపేట జంక్షన్, దేవుని కడప రోడ్, మాచుపల్లి జంక్షన్ నుండి కృష్ణ సర్కిల్ వరకు జరుగుతున్న పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అంబేద్కర్ సర్కిల్ టు వై జంక్షన్ వరకు జరుగుతున్న పనులలో భాగంగా డ్రైవ్ పనులను లెవెల్స్ ఆధారంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. వై జంక్షన్‌లో గ్రిల్ ఏర్పాటు చేయుటకు తగిన ప్రణాళిక రూపొందించాలన్నారు. వై జంక్షన్ నుండి అప్సర సర్కిల్ వరకు ఏర్పాటు చేస్తున్న డ్రైన్ వద్ద వీధి దీపాల పోల్స్ షిఫ్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులకు సూచించారు. మాసాపేట జంక్షన్‌లో స్టోన్ వర్క్ పూర్తి చేయాలన్నారు. మాచుపల్లి జంక్షన్ వద్ద నుండి కృష్ణ సర్కిల్ వరకు జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్



దాతృత్వం

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని రామచంద్రాపురం (కొట్టాలు)గ్రామంలో గురవారం లేవాకు గ్రూప్స్ అధినేత లేవాకు లక్ష్మిరెడ్డి పేదలకు ఉచితంగా వడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రతి ఏటా లాగానే ఈ ఏడాది కూడా 2 ఎకరాలు సొంత పొలంలో వరిపంటను పండించి పబ్బాపురం, కొట్టాలు, రామరాజుపల్లె గ్రామాల్లోని పేద కుటుంబాలకు ఒకొక్కరికి ఒక మూట చొప్పున 70 బస్తాల ధాన్యాన్ని ఉచితంగా అందించారు. లేవాకు గ్రూపు డైరెక్టర్ నితీష్‌రెడ్డి , లేవాకు గ్రూపు ప్రతినిధులు అనిల్‌రెడ్డి, మహేశ్వరెడ్డి, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

చెన్నూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆరోగ్యశ్రీ కార్డులను మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి పేదవాడు తనకు ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా ఉండేందుకు రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచాదన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం యొక్క ఉపయోగాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించాలని ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు, వలంటీర్లలకు సూచించారు. ఆరోగ్యశ్రీ కార్డులను త్వరగా ప్రజలకు చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రమణ్యం శర్మ, పంచాయతీ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, డాక్టర్ సీహెచ్ వంశీకృష్ణ, సొసైటీ ప్రెసిడెంట్ అల్లి శ్రీరామ్మూర్తి, వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

వల్లూరు : మండలంలోని ఆదినిమ్మాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగాలివారిపల్లె నుంచి కేసీ కెనాల్ వరకు పొలాల మీదుగా వెళ్లే దారి, కొత్తగాలివారిపల్లె నుంచి ఇసుకపల్లెకు వెళ్లే దారుల వెంబడి ముళ్ల పొదలు దట్టంగా పెరిగి రోడ్డు గుంతలమయంగా మారింది. గ్రామంలో ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డికి స్థానికులు రోడ్డు సమస్యను తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన తన సొంత నిధులను వెచ్చించి స్థానిక వైఎస్ఆర్‌సీపీ నేతల ఆధ్వర్యంలో గురువారం జేసీబీతో ఆ దారుల వెంబడి వున్న ముళ్ల పొదలను తొలగించారు. గుంతలమయంగా వున్న దారిలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తోలించి గుంతలను చదును చేసి రాక పోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. దీనిపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



జేసీబీతో ముళ్లపొదలను తొలగిస్తున్న దృశ్యం

శాస్త్రోక్తంగా హోమాలు

వల్లూరు : స్థానిక తూర్పు వీధిలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో గురువారం హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం కళశ పూజలను, కళశ ఆరాధనను నిర్వహించారు. కోదండరామస్వామి, సీతా, లక్ష్మణులకు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదర్‌రావు, జీవీ నరసయ్య కోరారు. గురువారం కడపలో నిర్వహించిన నాన్ ఆపరేషన్ రీజియన్ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, కడప జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కేకే కుమార్, ఎన్.రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోసు బాబు, రామ్మూర్తి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పూలు పెట్టుకొని నిరసన

కడప కార్పొరేషన్: సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు గురువారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కడప నగరపాలక సంస్థ ఎదుట చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయడం, సమాన పనికి సమాన వేతనం వంటివి తక్షణం అమలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్. రవి, కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

కడప ఎడ్యుకేషన్: పరిసరాల పరిశుభ్రతలో యువత ముందుండాలని వైవీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా గురువారం కడప నగర శివార్లలోని సింగపూర్ సిటీలో ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. సంబంధిత క్యాంపును వైవీయూ కో ఆర్డినేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగపూర్ సిటీలోని వీధుల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ప్రథమ ఎంసీఏ బ్యాచ్ (2007–2010) పూర్వ విద్యార్థుల సమ్మేళనం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ 13 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఈ విధంగా కలవడం, విద్యాలయానికి సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. బి. రెడ్డయ్య మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులకు, విభాగానికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం పూర్వ విద్యార్థులు డిపార్ట్‌మెంట్‌కు ఎల్ఈడీ టీవీని బహుకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వీరమల్లు, పార్థసారథి (యూఎస్ఏ), వినోద్‌కుమార్ బట్టు, బి. ఓబులేసు, నాగదాసరి వంశీకృష్ణ, పి. కల్యాణ్‌రామ్, నాగేంద్ర, లక్ష్మీదేవి, స్వర్ణప్రతిమ, అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల

వైవీయూ : జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కడప నగరంలోని వై జంక్షన్ సర్కిల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పెంచలయ్య, రాజు, వంశీ, హరి, శంకర్, బాలాజీ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కడప రాయుడికి పునర్వసు పూజలు



గంధ లేపనం అలంకారంలో కడపరాయుడు

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం పునర్వసు పూజలను నిర్వహించారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. విశ్వక్సేన పూజ, అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చి పుణ్యాహవాచనంతో శుద్ధి చేశారు. అనంతరం పరిమళ ద్రవ్యాలు, పూలతో దేవతామూర్తులకు అలంకారం నిర్వహించారు.

రక్తదానం

వైవీయూ : కడప నగరంలోని రిమ్స్‌లో 66 సంవత్సరాల రెడ్డమ్మ అనే వృద్ధురాలికి ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో నగరానికి చెందిన జీబీవీఎస్ ది ప్రిజర్వెర్ సేవాసమితి సభ్యులు రక్తదానం చేశారు. ఇంద్రసేనారెడ్డి అనే రక్తదాత వారికి సకాలంలో రక్తం అందించినట్లు సంస్థ అధ్యక్షుడు అశోక్ తెలిపారు. వీరిని రిమ్స్ బ్లడ్‌బ్యాంక్ అధికారులు అభినందించారు.

దుప్పట్ల పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపకు చెందిన సఖీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఫౌండేషన్ ప్రతినిధి రహమతున్నీసా సరోజినినగర్‌లోని 10 వలస కూలీల కుటుంబాలకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శారద, సునీత, డాక్టర్ నుస్రత్ తదితరులు పాల్గొన్నారు.